

మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ

విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసేందుకు నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తోందని పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం విద్యానగర్‌లోగల పీడీఎస్‌యూ నగర కార్యాలయంలో జాతీయ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మోదీ విద్యార్థి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు యు. గనిరాజు, ఎం. వెంకట్‌రెడ్డి, ఎ. సాంబ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల నియామకంలో జాప్యం

- **పెండింగ్‌లో ఫిర్యాదులు, దరఖాస్తులు**

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబర్‌పేట సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్లు బదిలీ అయి రోజులు గడుస్తున్నా అధికారులను నియమించకపోవడంతో ప్రజా ఫిర్యాదులు, భవనాల నిర్మాణం కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏసీపీ వేణు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ నల్లగొండకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఎవరినీ నియమించ లేదు. ఏసీపీ, సెక్షన్ ఆఫీసర్లను నియమించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను పలువురు కోరుతున్నారు.

జంధ్యాల పాపయ్యశాస్త్రి కవితలు కరుణ రస ప్రధానం



మాట్లాడుతున్న మధుసూదనాచారి

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కరుణశ్రీగా జంధ్యాల పాపయ్యశాస్త్రి సార్థక నామధేయుడని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా జంధ్యాల పాపయ్యశాస్త్రి యాదిలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుసూదనాచారి మాట్లాడుతూ.. జంధ్యాల పాపయ్యశాస్త్రి కవితలు కరుణ రస ప్రధానంగా ఉంటాయన్నారు. పాపయ్యశాస్త్రి రచించిన పుష్ప విలాపం మధుర గాయకుడు ఘంటసాల గానంతో జగద్విఖ్యాతి పొందిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, గాయకుడు త్రినాథరావు, కళా పోషకుడు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి కో-కన్వీనర్ల నియామకం



గోవర్ధన్‌రెడ్డి, పాండురంగయ్య, వెంకటస్వామికి కండువాలు కప్పుతున్న ఆనంద్‌గౌడ్

రాంనగర్/అంబర్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కో-కన్వీనర్లుగా బీజేపీ నాయకులు పి. గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, అంబర్‌పేట డివిజన్ కన్వీనర్‌గా వెంకటస్వామిగౌడ్, కో-కన్వీనర్లుగా దయాకర్‌యాదవ్, అనంతరాములు నియమితులయ్యారు. గణేశ్ ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ జి. ఆనంద్ గౌడ్ మంగళవారం వారి నియామకాన్ని ప్రకటించి కండువాలు కప్పి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ సమితి నేతలు దాసోజు నాగ భూషణంచారి, మైలారం రాజు, మనోజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బైబిల్ హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సూచించారు. మంగళవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని శేఖర్‌రెడ్డి వీధిలో బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో..

రాష్ట్రీయ బాలస్వాస్థ్య (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ లారా, ఏఎన్‌ఎం శ్రీదేవి, స్కూల్ కార్యదర్శి రతన్ పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

మెట్రోరైలు బోగీలు పెంచాలని సంతకాల సేకరణ

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మెట్రోరైలు బోగీలను పెంచాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీఎం నగర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాగోల్ నుంచి రాయదుర్గం, ఎల్బీనగర్ మియాపూర్ వెళ్లే మార్గంలో మెట్రో రైలు ఎక్కడం, దిగడం కష్టంగా ఉందన్నారు. పీక్ టైమ్‌లో రైలు లోపల నిలబడలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో మూడు బోగీలను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు ఆర్. వెంకటేష్, ఎస్. మారన్న, ముషీరాబాద్ జోన్ నాయకులు రమేష్, బాబు, పాషా, మల్లయ్య, రాజయ్య, నాగరాజు, సలీమ్ పాల్గొన్నారు.

రేపు బహుభాషా కవిసమ్మేళనం

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 15వ తేదీ ఉదయం 10 గంటలకు త్యాగరాయగానసభలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కవి రఘుశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా విదుషీమణి డా. అనంతలక్ష్మి, సాహితీవేత్త మంజుశ్రీకి మానవతావాది సీహెచ్ హనుమంతరావు స్మారక పురస్కారం బహూకరణ ఉంటుందన్నారు.

'డెంగీ కేసులు పెరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం'

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో డెంగీ కేసులు పెరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. మంగళవారం నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమకాటుకు గురై ప్రజలు మలేరియా, డెంగీ బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : ఆమ్ ఆద్మీ

కవాడిగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షా కాలంలో డెంగీ, చికున్‌గున్యా, విషజ్వరాలు విజృంభిస్తున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం లిబర్టీలో గల పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ





బైక్ ర్యాలీలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ఎన్. గౌతమ్‌రావు, వనం రమేష్ తదితరులు

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంబర్‌పేట చే నంబర్ చౌరస్తా నుంచి కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం వరకు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు మాట్లాడుతూ.. గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, వీర సావర్కర్ లాంటి వారు ఎంతోమంది దేశం కోసం ప్రాణాలను త్యాగం చేశారని, వారిని గుర్తు చేసుకోవడమే తిరంగా ర్యాలీ ఉద్దేశమన్నారు. మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సి. కృష్ణాయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్ యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, సి. వినోద్ యాదవ్, ఎక్కాల కన్నా తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో..

నల్లకుంట: బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం చేనెంబర్ చౌరస్తా నుంచి తిలక్‌నగర్ సీగల్‌కేఫ్, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా మీదుగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీమంత్రి సి. కృష్ణాయాదవ్, మాజీ కార్పొరేటర్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంగళవారం కవాడిగూడ డివిజన్ కొత్త బజార్ మెయిన్ రోడ్డు నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న పాకిస్థాన్ యుద్ధ ట్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ సంగీత, పీఈటీ మల్లేశం మాట్లాడుతూ.. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ఎంతో మంది మహనీయులు దేశం కోసం జీవితాలను త్యాగం చేశారని, వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

జాతీయ పతాకాల పంపిణీ

రాంనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ కోరారు. మంగళవారం హరినగర్‌లో జాతీయ పతాకాలను ప్రదర్శించి ఇంటింటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై యుద్ధ ట్యాంకు వద్ద త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు



హరినగర్‌లో జాతీయ పతాకాలను ప్రదర్శిస్తున్న బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు

దేశభక్తిని చాటాలి



జాతీయ జెండాకు వందనం చేస్తున్న డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ అశోక్‌నగర్‌లో తన ఇంటిపై జాతీయ జెండాను మంగళవారం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ దేశభక్తిని చాటాలని, ఇళ్లపై మువ్వన్నెల జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు ఐ. సురేష్, స్వామిరావు, రాకేష్ పాల్గొన్నారు.



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

కవాడిగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ సూచించారు. బీజేపీ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం గగన్‌మహల్‌లో ఏవీ కళాశాల వద్ద గల భగత్ సింగ్ విగ్రహం, పూల్‌బాగ్‌లోని అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు, నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, మహిళా మోర్చా నాయకురాలు పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో భారీ వర్షం

- **లోతట్టు ప్రాంతాలు జలమయం**

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పార్సీగుట్ట, ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి, బాప్టిస్ట్ చర్చి వీధుల్లో వర్షపు నీరు ఏరులై ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందారు. గంగపుత్ర కాలనీలో ఎంసీహెచ్ పార్కులో వర్షపు నీరు చేరడంతో చెరువును తలపించింది. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులుపడ్డారు.



పార్కులో నిలిచిన వర్షపు నీరు



బాప్టిస్టు చర్చి వీధిలో పారుతున్న వరద నీరు

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ వెంకట్‌రావు తెలిపారు. కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్త పరీక్షలు, ఈసీజీ, 2డి ఈకో, కంటి, డెంటల్ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.



ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్యను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలి

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపునకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ జె. నర్సయ్య అన్నారు. మంగళవారం ఆయనను బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవి, శ్రీనివాస్, డేవిత్ తదితరులు పాల్గొన్నారు.



గాజుల అలంకారంలో భవానీదేవి, లలితా సహస్రపారాయణంలో భక్తులు

గాజులతో భవానీదేవి అలంకరణ

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజల్లో భాగంగా మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని భవానీ మందిరంలో అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకారంతో దర్శనమిచ్చారు. భవానీదేవిని గాజులతో అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని లలితా సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈవో మాచర్ల దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరిగా అష్టైశ్వర్యలక్ష్మి



శాకంబరి అలంకారంలో అష్టైశ్వర్యలక్ష్మి

నల్లకుంట: శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం తిలక్‌నగర్‌లోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో అష్టైశ్వర్యలక్ష్మిని శాకంబరీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు ఉమాదేవి శ్యామ్‌రావు, రమాదేవి, శైలజ, ఉదయశ్రీ, సంతోషి, సునీత, రజిత, చంద్రకళ పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లకు ఒకేచోట డస్ట్ బిన్ ఉండాలి

- **గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో డోర్ టూ డోర్ తిరగకుండా ఒకేచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభమవుతుందని, అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లలో చెత్తసేకరణ పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలకు రావడం లేదని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం వల్ల చెత్తను స్వచ్ఛ ఆటోలో తీసుకునేందుకు సులభమవుతుందన్నారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్లు ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాల నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేడు మల్లేపల్లిలో జాబ్ మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లిలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 15వేల వేతనం ఉంటుందన్నారు.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని వేణుస్వామికి రాష్ట్ర మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల సినీ నటుడు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగు ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేయడంతో ఆయనకు నోటీసులు జారీ చేశారు.

గోడకూలి ఇద్దరికి తీవ్రగాయాలు

ముషీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో మంగళవారం గోడ కూలి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందిరానగర్‌లో మసీదు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఎక్స్‌కవేటర్‌తో సెల్లార్ మట్టి తీస్తుండగా పక్కనే ఉన్న గోడ అక్కడ పనిచేస్తున్న ఒడిశాకు చెందిన అలోక్, మింటుపై కూలింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ముషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐదుగురికి జైలు

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు నిబంధనలు ఉల్లంఘించి అర్ధరాత్రి వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ముషీరాబాద్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్(33), మహ్మద్ షరీఫ్(23), అహ్మద్ పాషా(31), వజీర్‌ఖాన్(31), ఆర్. నవీన్‌కుమార్‌గౌడ్(52) అర్ధరాత్రి వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు వారిని అరెస్ట్ చేసి మంగళవారం నాంపల్లిలోని 5వ కోర్టు మేజిస్ట్రేట్ సత్యనారాయణ ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్.. మహ్మద్ ఇంతియాజ్, మహ్మద్ షరీఫ్, అహ్మద్ పాషా, వాజీర్‌ఖాన్‌కు మూడు రోజులు, ఆర్. నవీన్‌కుమార్‌గౌడ్ ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

బైక్ దొంగ అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన బైక్ దొంగ (ముసుగు వేసిన వ్యక్తి)

చిక్కడపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బైక్ దొంగిలించిన వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బావర్చి బిర్యానీ హోటల్‌కు మహ్మద్ ఖాలిద్ సైఫుల్లా బైక్‌పై వెళ్లాడు. పార్కింగ్‌లో బైక్ పెట్టి హోటల్ లోపలికి వెళ్లి వచ్చేసరికి వాహనం కనిపించకపోవడంతో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడు సుమంత్ అలియాస్ సంతోష్‌ను బాగ్‌లింగంపల్లిలో అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా

తప్పించుకు తిరుగుతున్న నిందితుడికి రిమాండ్

రాంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ రిజ్వాన్ గత ఏడాది జూన్ 6వ తేదీన అమ్మాయిలను ఎరవేసి దోపిడీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేశారు. బయటకు వచ్చిన అతడు ముషీరాబాద్, సంతోష్‌నగర్, ఆసిఫ్‌నగర్ పీఎస్‌ల పరిధుల్లో చోరీలు చేశాడు. ఈ కేసుల్లో అరెస్ట్ అయిన అతడు బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. పోలీసులు నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

సెల్‌ఫోన్ చోరీ కేసులో ముగ్గురికి ఏడాది కఠిన కారాగార శిక్ష

బర్కత్‌పుర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కత్తితో బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కొని పారిపోయిన ముగ్గురు దొంగలకు రైల్వే కోర్టు ఏడాది కఠిన కారాగార శిక్ష విధించిందని కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపారు. హుందానగర్‌లో రైల్వే స్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబర్ 20న కేశవ అనే రైల్వే ప్రయాణికుడిని అబ్దుల్ రషీద్(42), మహ్మద్ జావెద్(24), ప్రభు(23) కత్తితో బెదిరించి సెల్‌ఫోన్, నగదు లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం కేసును విచారించిన రైల్వే కోర్టు న్యాయమూర్తి ఎండీ గౌస్‌పాషా నిందితులకు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని సీఐ తెలిపారు.

'వైద్యురాలిని హత్య చేసిన నిందితులను శిక్షించాలి'

కవాడిగూడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో మహిళా వైద్యురాలిని హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ లక్షనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం దోమలగూడలోని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాణాలు కాపాడే వైద్యులకే భద్రత లేకపోతే మిగిలిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహిళా వైద్యులకు ప్రభుత్వాలు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీస్ రూల్స్‌తో ఉపాధ్యాయులకు అన్యాయం



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్ తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు టి.ప్రకాష్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ కలీల్ అహ్మద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా విద్యాశాఖలో పని చేస్తున్న సుమారు 12 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు రాలేదన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో జీవోలు తెచ్చి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కలిపి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ జీవోలపై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. ఉమ్మడి సర్వీస్ రూల్స్ చెల్లదని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఎంఈఓలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై. కృష్ణారావు, పోశం కృష్ణమూర్తి, శ్రావణ్ కుమార్, సైదులు రెడ్డి, సంపత్‌కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.